క్లుప్తంగా

విజయవాడకు నిత్యావసరాల తరలింపు



బాధితుల కోసం సిద్ధం చేసిన నిత్యావసర వస్తువుల కిట్లు

బోట్‌క్లబ్‌: వరదలతో అతలాకుతలమైన విజయవాడలో బాధితుల కోసం కాకినాడ రోటరీ సెంట్రల్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో నిత్యావసరాల కిట్లను గురువారం అక్కడికి తరలించారు. బియ్యం, కందిపప్పు, పప్పులు, చింతపండు, గోధుమపిండి, చక్కెర తదితర వస్తువులతో కూడిన కంటైనర్‌ను రోటరీ సెంట్రల్‌ ట్రస్టు భవనం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. రోటరీ సెంట్రల్‌ అధ్యక్షుడు బంగారు కృష్ణమోహన్‌, కార్యదర్శి దుర్గాప్రసాద్‌, ప్రాజెక్టు చైర్మన్‌ జయేష్‌ మాట్లాడుతూ, రూ.3 లక్షల విలువైన నిత్యావసర వస్తువులను ఒక్కో బాధిత కుటుంబానికి కిట్‌ రూపేణా అందిస్తామన్నారు. వీటిని పంపిణీ చేసేందుకు 10 మంది సభ్యుల బృందం విజయవాడకు పయనమైందన్నారు. కార్యక్రమంలో క్లబ్‌ సభ్యులు యడ్లపల్లి వేణునాథరావు, సూర్యం, హరిబాబు, వెంకట్‌, అనుపమ సాగర్‌ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



వస్త్ర సంచులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్‌: పర్యావరణానికి ప్లాస్టిక్‌ సంచుల వినియోగంతో ముప్పు ఉందని విశ్రాంత తహసీల్దార్‌ రేలంగి బాపిరాజు అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్‌ సంచుల శూన్య దినోత్సవం సందర్భంగా అడబాల ట్రస్ట్‌ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రమణయ్యపేటలో అవగాహన సదస్సు జరిగింది. ప్లాస్టిక్‌ సంచుల వినియోగంతో వచ్చే ఆరోగ్య సమస్యలు, పర్యావరణానికి హానిపై వక్తలు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ సంచుల స్థానే వస్త్ర సంచులు వినియోగించాలని కోరారు. ట్రస్ట్‌ ద్వారా వస్త్ర సంచులను పంపిణీ చేశారు, కార్యక్రమంలో ట్రస్ట్‌ సభ్యులు అడబాల రత్నప్రసాద్‌, బుద్ధరాజు సత్యనారాయణరాజు, రాజా, శ్రీనగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరి ఆలయానికి రూ.7.58 లక్షల ఆదాయం



హుండీల ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్‌: దేవదాయ శాఖ కాకినాడ డివిజన్‌ ఇన్‌స్పెక్టర్‌ వడ్డి ఫణీంద్రకుమార్‌ సమక్షంలో స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. ఐదు నెలల 20 రోజుల వ్యవధికి గాను రూ.7.58 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ సిటీ: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం కాకినాడ డి7 సెక్షన్‌ పరిధిలోని 33/11 కేవీ డెయిరీ ఫారం సబ్‌ స్టేషన్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు అన్ని ఫీడర్లపై విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్‌ కాకినాడ ఈఈ ఎస్‌ ఉదయ్‌భాస్కర్‌ గురువారం సాయంత్రం తెలిపారు. ఈ ఫీడర్‌ పరిధిలోని డెయిరీ ఫారం సెంటర్‌, దుమ్ములపేట, పల్లంరాజునగర్‌, సాంబమూర్తినగర్‌, అయోధ్యనగర్‌, దుమ్ములపేట రాజీవ్‌ గృహకల్ప అపార్టుమెంట్స్‌, రెవెన్యూ కాలనీ, సత్యనగర్‌, స్వర్ణాంధ్ర కాలనీ, ఇందిరా కాలనీ, గణేష్‌ కాలనీ, జ్యోతుల కాలనీల్లో విద్యుత్‌ అంతరాయం కలుగుతుందని వివరించారు.

ఘనంగా భువనేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవం



భువనేశ్వరి పీఠంలో పూజలు నిర్వహిస్తున్న గోపిశర్మ సిద్ధాంతి

పెద్దాపురం: భువనేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవం స్థానిక వర్ధులవారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి వేద మంత్రోచ్ఛరణ మధ్య అభిషేక కార్యక్రమాలు జరిపించారు. అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పీఠాధిపతి గోపిశర్మ మాట్లాడుతూ, పీఠంలో మూడు రోజులుగా పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పట్టణంలో స్టాళ్లు ఏర్పాటు చేసి అమ్మవారి ప్రసాద వితరణ చేశామన్నారు. ముగింపు రోజైన గురువారం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోర్టున్నా.. డోంట్‌ కేర్‌

- కోర్టు మార్గంలో వాహనాల అపరిమిత వేగం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం
- స్పీడ్‌ బ్రేకర్లు అవసరమంటున్న స్థానికులు



కోర్టుకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే..

కాకినాడ లీగల్‌: వాహనాల వేగానికి కళ్లెం ఉండడం లేదు. అది ఏ రోడ్డయినా సరే. కోర్టులు, పోలీస్‌స్టేషన్లు ఉన్నాయన్న కనీస బెరుకు కూడా వాహనదారుల్లో కానరావడం లేదు. ఈ క్రమంలోనే కాకినాడ కోర్టు మార్గంలో వేగ నియంత్రణ లేని వాహనాలు నిత్యం స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి.

కాకినాడ జిల్లా పరిషత్‌ సెంటర్‌లో ఉన్న కోర్టు కాంపౌండ్‌కు, జిల్లా రిజిస్ట్రార్‌ ఆఫీస్‌, సబ్‌ జైలు, జిల్లా ట్రెజరీ కార్యాలయ ప్రధాన రహదారిని దాటుకుని లోపలికి వెళ్లాలంటే సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు, కక్షిదారులకూ తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం న్యాయవాదులు, ఉద్యోగులు, కక్షిదారులతో రద్దీగా ఉండే కార్యాలయాలన్నీ ఈ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్నాయి. దీంతో ఉదయం 9.30 నుంచి ఆయా కార్యాలయాలకు వచ్చేపోయే వారితో బిజీగా ఉంటుంది. అయితే వార్ఫు రోడ్డు నుంచి జిల్లా పరిషత్‌కు వచ్చే బస్సులు, కార్లు, లారీలు, ఇతర వాహనాలు ఈ రహదారి వెంబడి అమిత వేగంగా ప్రయాణిస్తుంటాయి. దీనివల్ల కోర్టులకు, రిజిస్ట్రార్‌ కార్యాలయానికి, ఇతర కార్యాలయాలకు వెళ్లే వారు ఆ వాహనాలను తప్పించుకుని, రహదారి దాటే క్రమంలో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

మళ్లించే మార్గమే లేదు

ఈ రహదారిలో వాహనాల రాకపోకలను దారి మళ్లించే మార్గం లేదంటున్నారు. ఈ కారణంగా రహదారిలో స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని న్యాయవాదులు, ఉద్యోగులు, కక్షిదారులు చెబుతున్నారు. కోర్టు కాంపౌండ్‌లో 15 కోర్టులు ఉన్నాయి. ఈ కోర్టులకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు సుమారు రెండు వేల మంది వస్తూ, వెళ్తూ ఉంటారు. అలాగే రిజిస్ట్రార్‌ కార్యాలయానికి సుమారు 800 నుంచి వెయ్యి మంది వస్తుంటారు. సబ్‌ జైలు, ట్రెజరీ కార్యాలయాలకు వచ్చే వారు సుమారు 500 మంది వరకు ఉంటారు. వీరందరికీ ఇదే ప్రధాన రహదారి కావడంతో, వచ్చేపోయే వాహనాలతో వీరికి నిత్యం ప్రమాదం పొంచి ఉంటుంది. అందువల్ల స్పీడ్‌ బ్రేకర్లు వేసి, ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

స్పీడ్‌ బ్రేకర్లు వేయాలి



ప్రధాన జంక్షన్‌ను ఆనుకుని ఉన్న కోర్టులకు, జిల్లా పరిషత్‌కు ప్రధాన రహదారి అయిన వార్ఫు రోడ్డు నుంచి జెడ్పీకి వచ్చే రహదారిలో స్పీడ్‌ బ్రేకర్లు వేయాలి. స్పీడ్‌ బ్రేకర్లు లేకపోవడంతో వేగంగా వస్తున్న వాహనాలతో ప్రతి రోజూ అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి స్పీడ్‌ బ్రేకర్లు వేయాలి.
– కోలా శ్రీహరిరావు, న్యాయవాది, కాకినాడ

ట్రాఫిక్‌ కానిస్టేబుల్‌ను నియమించాలి



నిత్యం రద్దీగా ఉండే కోర్టు కాంపౌండ్‌ ప్రధాన రహదారి వద్ద ట్రాఫిక్‌ కానిస్టేబుల్‌ను నియమించాలి. కోర్టుకు, రిజిస్ట్రార్‌, ట్రెజరీ కార్యాలయాలకు వివిధ గ్రామాల నుంచి ఇక్కడకు నిత్యం వందలాది మంది వస్తున్నారు. వీరు రహదారి దాటాలంటే వేగంగా వస్తున్న వాహనాలతో భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ ఉదయం 9.30 నుంచి ట్రాఫిక్‌ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు. – ముత్తింటి గని రాజ్‌కుమార్‌, న్యాయవాది, కాకినాడ

ఆధ్యాత్మిక సేవలు అభినందనీయం

- డాక్టర్‌ ఉమర్‌ ఆలీషా



హేరంబ మట్టి గణపతిని దర్శించుకుంటున్న డాక్టర్‌ ఉమర్‌ ఆలీషా

కాకినాడ రూరల్‌: రోగులకు వైద్య సేవలే కాకుండా, ఆధ్యాత్మికంగా డాక్టరు గౌరీశేఖర్‌ అందిస్తున్న సేవలు అభినందనీయమని పిఠాపురం శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్‌ ఉమర్‌ ఆలీషా అన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏపీఎస్పీ ఎదురుగా తిరుమల ఆస్పత్రి వద్ద నేపాలీ సంప్రదాయంతో రూపొందించిన హేరంబ మట్టి గణపతిని గురువారం సద్గురువు ఉమర్‌ ఆలీషా సందర్శించారు. మానవాళి చేపట్టే కార్యక్రమాల్లో విఘ్నాలు లేకుండా నిర్వహింపబడాలంటే గణపతిని పూజించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ గౌరీశేఖర్‌, పీఠం కన్వీనర్‌ పేరూరి సూరిబాబు, మాజీ సర్పంచ్‌ అడబాల రత్నప్రసాద్‌, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై డీఎల్పీఓ విచారణ

- తూరంగి పంచాయతీ కార్యదర్శి, బిల్లు కలెక్టర్లపై అందిన ఫిర్యాదులు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్‌ మండలం తూరంగి పంచాయతీకి చెందిన గ్రామ కార్యదర్శి, బిల్లు కలెక్టర్లపై వచ్చిన అవినీతి ఆరోపణలపై డివిజనల్‌ పంచాయతీ అధికారి అన్నామణి గురువారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, బిల్లు కలెక్టర్‌ వీరబాబులు పంచాయతీలో అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తూరంగి పంచాయతీ అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణపై విచారణ చేపట్టాలని డీఎల్పీఓ అన్నామణిని డీపీఓ ఆదేశించారు. దీంతో ఆమె గురువారం శాఖాపరమైన విచారణ చేపట్టారు. ఈ విచారణను పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, బిల్లు కలెక్టర్‌ వీరబాబు, ఫిర్యాదుదారుడు సబ్బతి ఫణీశ్వరరావు సమక్షంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అనధికార లేఅవుట్లను ప్రోత్సహించి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు కాజేసి, దొడ్డిదారిన అనుతులిచ్చారని వివరించారు. తనకు లంచం ముట్టజెప్పకపోతే అధికారకంగా అన్ని పన్నులు చెల్లించి, అనుమతులున్న లేఅవుట్లను, సీసీ రోడ్లను ధ్వంసం చేసిన సందర్భాలను, ఆధారాలను విచారణ అధికారి అన్నామణికి ఫణీశ్వరరావు అప్పగించారు. అదేవిధంగా ఒకే పంచాయతీలో సుమారు 12 ఏళ్ల సుదీర్ఘకాలంగా పని చేస్తున్న బిల్లు కలెక్టర్‌ వీరబాబు అవినీతి పెచ్చుమీరిందని, ఏ పని చేయాలన్నా వేలాది రూపాయలు ముడుపులు లేనిదే పని చేయడని, పేదలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వివరించారు. 12 ఏళ్లగా ఒకేచోట పని చేస్తున్న వీరబాబును ఎందుకు బదిలీ చేయడం లేదో తెలపాలని ఫణీశ్వరరావు డీఎల్పీఓను నిలదీశారు. అదే విధంగా పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు పాల్పడిన అవినీతి అక్రమాలకు సంబంధించిన పలు ఆధారాలను తూరంగి హోప్‌ ఐలాండ్‌ కాలనీకి చెందిన ఊబా రాజ్‌కుమార్‌ డీఎల్పీఓ దృష్టికి తీసుకెళ్లి, ఆ విషయాలను విలేకర్లకు వివరించారు.

‘స్వచ్ఛతా హీ సేవ’తో క్లీన్‌ కాకినాడ



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్‌ భావన

- కార్పొరేషన్‌ కమిషనర్‌ భావన

కాకినాడ సిటీ: స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్‌ 2 వరకు చేపట్టే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంతో కాకినాడ నగరాన్ని క్లీన్‌ అండ్‌ గ్రీన్‌గా తీర్చిదిద్దాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ భావన అన్నారు. గురువారం రాత్రి అదనపు కమిషనర్‌ టీకే సుధాకర్‌, ఎస్‌ఈ సత్యకుమారి, ఈఈ మాధవి, ఎంహెచ్‌ఓ డాక్టర్‌ పృథ్వీచరణ్‌, టీపీఆర్వో శైలజ, స్మార్ట్‌ సిటీ కార్పొరేషన్‌ తదితర విభాగాల అధికారులతో కలిసి కమిషనర్‌ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో చెత్త నిల్వలు లేకుండా చూడడం, చెత్త నుంచి సంపద సృష్టి, మురుగు కాల్వలను శుభ్రపరచడం, పూడికల తొలగింపు, పారిశుధ్య కార్మికులకు అవార్డుల ప్రదానం వంటి కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతా కీ భాగేదారీ, సంపూర్ణ స్వచ్ఛతా, సఫాయి మిత్ర సురక్ష వంటి కీలకాంశాల ఆధారంగా నిర్వహించాలని వివరించారు. స్వచ్ఛతా కీ భాగేదారీలో ప్రజలను భాగస్వాములను చేయడం, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేలా అవగాహన కార్యక్రమాల నిర్వహణ, పరిశుభ్రతపై ర్యాలీలు చేపట్టాలని ఆదేశించారు. సుమారు 15 రోజుల పాటు సాగే ఆయా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, కాకినాడను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కమిషనర్‌ భావన పిలుపునిచ్చారు.

లౌకిక తత్వానికి దన్నుగా నిలిచిన ఏచూరి

- సీపీఎం నేతల నివాళులు



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ సుందరయ్య భవన్‌లో గురువారం రాత్రి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కన్వీనర్‌ ఎం రాజశేఖర్‌, జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషుబాబ్జీ, కేఎస్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ, సామాన్య ప్రజలందరికీ విద్య అందించాలని, శాస్త్రీయ విద్యా విధానం కావాలని విద్యార్థి ఉద్యమంలో ఏచూరి పాల్గొన్నారన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జవహర్‌లాల్‌ నెహ్రూ యూనివర్సిటీ ఢిల్లీలో విద్యార్థి ఉద్యమ నాయకుడిగా నాటి ప్రధాని ఇందిరాగాంధీని సైతం నిలదీశారన్నారు. భారత రాజ్యాంగాన్ని, దేశ సార్వభౌమత్వాన్ని, లౌకికతత్వానికి దన్నుగా నిలిచారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేసే విధానాలను తిప్పికొట్టారని చెప్పారు. భిన్నత్వంలో–ఏకత్వం భారత జీవన విధానమని చాటి చెప్పిన మేధావి అని కొనియాడారు. 12 ఏళ్ల పాటు రాజ్యసభ సభ్యునిగా పార్లమెంట్‌లో ప్రజల గొంతు వినిపించారని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పలివెల వీరబాబు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పి.రామకృష్ణ, సీహెచ్‌ రమణి, సీహెచ్‌ విజయకుమార్‌ తదితరులు ఏచూరితోనూ, కాకినాడతో ఆయనకున్న అనుబంధాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంకా నాయకులు కె.వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, మలకా రమణ, టి.రాజా, సీహెచ్‌ వేణు, సీహెచ్‌ వెంకటరావు, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

16న సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జన వేడుక



నిమజ్జనోత్సవానికి ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కాకినాడ రూరల్‌: మండలంలోని సూర్యారావుపేట బీచ్‌లో ఈ నెల 16న వినాయక నిమజ్జన వేడుక ఘనంగా జరపాలని నగర గణేశ్‌ ఉత్సవ సమితి జిల్లా ప్రతినిధి బృందం పిలుపునిచ్చింది. మండలంలోని తిమ్మాపురం, రమణయ్యపేట, అచ్చంపేట జంక్షన్‌, వాకలపూడి, వలసపాకల, ఇంద్రపాలెం, చీడిగ, తదితర గ్రామాల్లో బృంద ప్రతినిధులు దూసర్లపూడి రమణరాజు, ఎనిమిరెడ్డి మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావు తదితరులు గురువారం పర్యటించారు. చవితి మండపాల నిర్వాహకులను నిమజ్జోత్సవానికి ఆహ్వానించారు. అనంతరం సూర్యారావుపేట బీచ్‌ను సందర్శించి, ఏర్పాట్ల కోసం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యారావుపేట బీచ్‌ వినాయక విగ్రహాల నిమజ్జోత్సవానికి అనుకూలంగా ఉందన్నారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు అధికారులు, పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు.


గణపతికి నదీ జలాలతో అభిషేకం




గణపతికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

బోట్‌క్లబ్‌: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయ శాఖ డీసీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సంపత్‌ విజయ గణపతి స్వామివారికి గురువారం వివిధ నదీ జలాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణా, కావేరి, భీమర్తి నదీ, పుష్కరవాణి, తుంగభద్ర, సింధు, పరిణీత నదీ జలాలతో అభిషేకం చేశారు. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. దేవదాయ శాఖ డీసీ కార్యాలయ సూపరింటెండెంట్‌ కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ పూజలు



ద్వారకానగర్‌లో సరస్వతీ పూజల్లో పాల్గొన్న చిన్నారులు



కరసూదివారివీధిలో సరస్వతీ పూజలు చేస్తున్న చిన్నారులు

బోట్‌క్లబ్‌: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక ద్వారకానగర్‌లో ఉన్న గణపతి మంటపంలో గణేశ్‌ యూత్‌ ఆధ్వర్యంలో సరస్వతీ పూజలు ఘనంగా నిర్వహించారు. సుమారు 300 మంది చిన్నారులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అంకంరెడ్డి రామునాయుడు సరస్వతీ పూజల్లో పాల్గొన్న చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పరీక్షల ప్యాడ్లు అందించారు. ఈ కార్యక్రమంలో గణేశ్‌ యూత్‌ సభ్యులు యనమదల నాగేశ్వరరావు, వెలుదుర్తి వీరబాబు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక పేర్రాజుపేట కరసూదివారి వీధిలోని బాలగణేశ్‌ యూత్‌ ఆధ్వర్యంలో గురువారం రాత్రి సరస్వతీ పూజలు నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందించారు.

కలెక్టర్‌ను కలిసిన నేతలు



కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

సామర్లకోట: మండలంలోని వీకే రాయపురం గ్రామానికి చెందిన పలువురు నాయకులు, అధికారులు గురువారం కలెక్టర్‌ షణ్మోహన్‌ను కాకినాడ కలెక్టరేట్‌లో కలిశారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి అదనపు జలాలు విడిచిపెట్టడంతో, వరద నీరు ఏలేరు కాలువ నుంచి సముద్రంలోకి వెళ్లే క్రమంలో వీకే రాయపురం వద్ద కాలువ గట్టు కోతకు గురైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్‌.. జేసీ రాహుల్‌ మీనాను పంపడంతో పాటు, కోతకు గురైన గట్టు గండిని పూడ్చేందుకు నిధులు మంజూరు చేశారు. దీంతో గండి పూడ్చివేత సాధ్యమైంది. ఈ నేపథ్యంలో సర్పంచ్‌ గొల్లపల్లి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్‌ కుర్రా నారాయణస్వామి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, పంచాయతీ కార్యదర్శి వై శ్రీహరి, పలువురు గ్రామ పెద్దలు కలెక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇక్కడ తగ్గి.. అక్కడ పెరిగి..!

- పిఠాపురంలో తగ్గుముఖం పట్టిన వరద
- కొత్తపల్లి మండలంలో కొనసాగుతున్న వైనం
- ఇంకా నీటిలోనే పంటలు, జనావాసాలు



గొల్లప్రోలులో ముంపు నుంచి తేరుకుంటున్న వరిచేలు



వరదలో కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లిలోని ఇళ్లు



వరద నీటిలో మునిగిన కొత్తపల్లి మండలం ఇసుకపల్లి

పిఠాపురం: మూడు రోజులుగా పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో బీభత్సం సృష్టించిన ఏలేరు వరద క్రమేపి తగ్గుముఖం పట్టింది. ఈ వరద నీరంతా దిగువ ప్రాంతమైన కొత్తపల్లి మండలానికి చేరడంతో, రెండు రోజులుగా వందలాది ఎకరాల పొలాలు, గ్రామాల్లో వరద కొనసాగుతూనే ఉంది. పిఠాపురం, గొల్లప్రోలులో తగ్గుతున్న వరద.. కొత్తపల్లి మండలంలో మాత్రం పెరుగుతోంది. ఏలేరు నుంచి నీటి విడుదల తగ్గిపోవడంతో ప్రస్తుతం వరద ఉధృతి తగ్గగా, ఇప్పటికే వచ్చిన వరద నీరు పిఠాపురం, గొల్లప్రోలు నుంచి కొత్తపల్లి మండలం మాధవపురం, ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట మీదుగా ఉప్పాడ సముద్రంలో కలుస్తోంది. దీంతో కొల్లపల్లి మండలంలో వరద ఉధృతి కొనసాగుతోంది. బుధవారం నిండా మునిగిన కొత్తపల్లి మండలం మాధవపురం, ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట గ్రామాలు ఇంకా వరద నీటిలోనే ఉండడంతో. స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.